క్లుప్తంగా

అన్నసత్రానికి నీటి సరఫరా నిలిపివేత



నయనాలప్ప ఆలయ ఆవరణలోని పైప్‌లైన్

సంజామల: మండల పరిధిలోని నయనాలప్ప క్షేత్రంలో అన్నసత్రానికి తాగునీటి సరఫరా నిలిపివేశారు. ఈ ఆలయానికి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. పదేళ్లుగా గుడి ఆవరణలోని అన్నసత్రానికి క్షేత్రం నుంచి తాగునీరు సరఫరా చేస్తున్నారు. అయితే నూతనంగా ఏర్పడిన ఆలయ కమిటీ సభ్యులు సత్రానికి తాగునీటిని నిలిపివేశారు. ఈ విషయాన్ని ఆలయ ఈఓ దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని అన్నసత్రం నిర్వాహకులు సర్పంచ్ వెంకట కృష్ణారెడ్డి, నాగిరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు హద్దుల గుర్తింపు



రోడ్డు హద్దులను గుర్తిస్తున్న సర్వేయర్లు

కోవెలకుంట్ల: పట్టణంలోని బనగానపల్లె చౌరస్తా నుంచి కోవెలకుంట్ల గ్రామ పొలిమేర వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు హద్దుల గుర్తింపు పనులను శనివారం చేపట్టారు. తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వేయర్లు రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు, ఆక్రమణలను ప్రొక్లెయిన్ ద్వారా తొలగించి ఆర్‌అండ్‌బీ రోడ్డు హద్దులను గుర్తించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం

కోవెలకుంట్ల: పట్టణంలోని జ్యోతి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి సబ్ జూనియర్స్ షూటింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సింధూరి తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థి శరత్‌కుమార్‌రెడ్డి ప్రతిభ చాటాడన్నారు. ఈ నెల 28, 30వ తేదీల్లో బిహార్ రాష్ట్రంలోని గయాలో నిర్వహించే 43వ సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. హెచ్‌ఎంతోపాటు కరస్పాండెంట్ సవిత్నాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రీడా పరికరాలను అందిస్తున్న అల్ట్రాటెక్ యూనిట్‌హెడ్

కొలిమిగుండ్ల: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణించాలని అల్ట్రాటెక్ సిమెంట్ యూనిట్‌హెడ్ సజేంద్రకుమార్ అన్నారు. శనివారం అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలకు రూ.90 వేలు విలువ చేసే క్రీడా సామగ్రిని అందజేశారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో ప్రతిభ దాగుందని.. క్రీడల్లో రాణించి జాతీయ స్థాయి పోటీల్లో ఆడేందుకు కృషి చేయాలని సూచించారు. అల్ట్రాటెక్ పంక్షన్ హెడ్ రంగకుమార్, హెచ్‌ఎం పద్మజ, పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనభోజనం

కోవెలకుంట్ల: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో శనివారం వనభోజన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యాలయ సమీపంలో ఉన్న శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అయ్యప్ప, శివ, భవానీ, నరసింహస్వామి మాలధారణ భక్తులకు అన్నదానం చేశారు. సంఘం నాయకులు మురళీకృష్ణ, కోదండరామయ్య, శివరాం పాల్గొన్నారు.

ఏరాశి కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

సంజామల: మండల పరిధిలోని బొందలదిన్నె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏరాశి ఈశ్వర్ రెడ్డి(87) అనారోగ్యంతో మృతి చెందారు. బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శనివారం గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఏరాశి శ్రీరాం రెడ్డి, ఏరాశి శ్రీనాథ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

క్రీడా సంకల్పం

ఆయనకు క్రీడలంటే మక్కువ. జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కూడా. మన ప్రాంతంలో అద్భుత నైపుణ్యం ఉన్నా, అవకాశాలు రాక మరుగునపడిన అనేకమంది క్రీడాకారుల గురించి ఆయనకు బాగా తెలుసు. సరైన ప్రోత్సాహం అందిస్తే వివిధ క్రీడల్లో మట్టిలో మాణిక్యాల్లా వెలుగులోకి తీసుకువచ్చనే దృఢసంకల్పం ఆయనది. ఆయనే నంద్యాల జిల్లా డోన్ డీఎస్పీ శ్రీనివాసులు.

–డోన్



డీఎస్పీ ఏర్పాటు చేసిన బాల్ బ్యాడ్మింటన్ కోర్ట్

- క్రీడాకారులకు ప్రోత్సాహం.. వసతులకు సహకారం
- మట్టిలో మాణిక్యాలు వెలికితీసే ప్రయత్నం
- రూ.2 లక్షల సొంత నిధులతో క్రీడా మైదానాల ఏర్పాటు చేసిన డీఎస్పీ
- త్వరలో షటిల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, క్రికెట్ పోటీలు



నిర్మాణ దశలో ఉన్న క్రికెట్ ప్రాక్టీస్ మైదానం



క్రీడా మైదానం చుట్టూ ఏర్పాటు చేసిన బెంచీలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రూ.4 కోట్ల వ్యయంతో డోన్‌లో అత్యాధునిక వసతులతో ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను నిర్మించారు. ముందు భాగాన ఆకర్షణీయమైన తోట ఏర్పాటు చేశారు. ఈ గెస్ట్‌హౌస్ వెనుక ఉన్న మైదాన ప్రాంతాన్ని రూ.2 లక్షల సొంత డబ్బు వెచ్చించి డోన్ డీఎస్పీ శ్రీనివాసులు చదును చేయించారు. ఒకచోట షటిల్ బ్యాడ్మింటన్ కోర్ట్, మరొక చోట బాల్ బ్యాడ్మింటన్ కోర్ట్, కబడ్డీ మైదానాలను ఏర్పాటు చేయించారు. అంతేకాక చిన్నారులు, యువకుల కోసం ప్రత్యేకంగా క్రికెట్ ప్రాక్టీస్ కోర్ట్‌లను సిద్ధం చేస్తున్నారు. ఈ కోర్ట్‌లలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను త్వరలో నిర్వహించడమే కాకుండా క్రీడాకారులకు లక్ష రూపాయల వరకు బహుమతిని అందజేసేందుకు డీఎస్పీ ముందుకు రావడంపై క్రీడాకారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి SUNDAY Special



కబడ్డీ మైదానం

మట్టిలో మాణిక్యాలు వెలుగులోకి వస్తాయి



ఇన్నాళ్లు ఎలాంటి సౌకర్యాలు లేక క్రీడలను ప్రోత్సహించే దాతలు లేక ప్రతిభ ఉన్న ఎందరో క్రీడాకారు లు మరుగున పడిపోయారు. డీఎస్పీ శ్రీనివాసులు చొరవతో పదుల సంఖ్యలో క్రీడాకారులు తమ ప్రతి భా పాటవాలను ప్రదర్శించి డోన్‌కు జాతీయస్థాయి లో ఖ్యాతిని ఆర్జించిపెట్టే అవకాశం ఉందని విశ్వసిస్తున్నా.

–కేఈ మౌలా, జాతీయ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు

మాజీ మంత్రి బుగ్గన బాటలో..



రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్‌లో ఇండోర్, షటిల్, టెన్నిస్ కోర్ట్‌లతో పాటు యోగా, రన్నింగ్, వాకింగ్ ట్రాక్‌లను ఏర్పాటుచేశారు. డోన్ డీఎస్పీ మరో ముందడుగు వేసి అదనంగా క్రీడా మైదానాలను ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయం. త్వరలో మన ప్రాంత క్రీడాకారులకు మంచి రోజులు రానున్నాయి.

–రైల్వే ప్రకాష్, రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, డోన్

ప్రతిభను వెలికితీస్తా



అద్భుత ప్రతిభ కలిగి సరైన అవకాశాలు దొరకక మరుగునపడిన క్రీడాకారులు ఎందరో ఉన్నారు. యువతలో ఇమిడి వున్న శక్తి సామర్థ్యాలు, క్రీడా నైపుణ్యాలను వెలికితీసేందుకు నా వంతు కృషి చేస్తు న్నా. ఇందుకు ఎంత ఖర్చయినా వెనకాడేది లేదు. త్వరలోనే పెద్దఎత్తున షటిల్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలను నిర్వహిస్తాం.

–శ్రీనివాసులు, డీఎస్పీ, డోన్

నయనాలప్ప క్షేత్రానికి ప్రత్యేక బస్సులు

కోవెలకుంట్ల: కార్తీక కడ సోమవారాన్ని పురస్కరించుకుని కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో నుంచి సంజామల మండలం అక్కంపల్లె సమీపంలో వెలసిన నయనాలప్ప క్షేత్రానికి ప్రత్యేక బస్ సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. ఈ నెల 25వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ప్రతి అర గంటకు కోవెలకుంట్ల నుంచి నయ నాలప్ప క్షేత్రానికి, అక్కడి నుంచి వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు బస్సులు నడపనున్నట్లు వెల్లడించారు. నంద్యాల, వైఎస్సార్ జిల్లాలకు చెందిన భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

26న బండలాగుడు పోటీలు

బేతంచెర్ల: మండల పరిధిలోని శంకరాపురం గ్రామంలో కార్తీక మాసం, వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న అంతర్రాష్ట్ర వృషభాల పాల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ. 5 వేల నగదు బహుమతులను అందజేస్తామన్నారు. 8179848454, 8341193220 నంబర్లను సంప్రదించాలన్నారు. 25న స్వామికి ప్రత్యేక పూజలు, పల్లకీ సేవ, రాత్రి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర నాటకం ప్రదర్శన ఉంటుందన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

డోన్ టౌన్: పట్టణంలోని గాంధీనగర్, అయ్యప్ప స్వామి వీధి, పుండరీనగర్, శ్రీకృష్ణానగర్, కురుకుంద కాలనీలకు సంబంధించి ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు పనుల కారణంగా ఆదివారం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు.

ఘనంగా హసన్‌వలి ఉరుసు

డోన్ టౌన్: పట్టణంలోని కొండపేటలో హజరత్ హసన్‌వలి, మౌలాలీస్వామి ఉరుసును శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఫతేహాలు సమర్పించారు. పకీర్ల కచేరి భక్తులను ఆకట్టుకుంది. మత పెద్దలు బోధనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. దర్గా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌పి చిన్న రహిమాన్, అహ్మద్‌బాషా పాల్గొన్నారు.

సాంబ శివాలయంలో తైలాభిషేకం

డోన్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక సాంబశివాలయంలో శనివారం స్వామివారికి తైలాభిషేకాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఓటు హక్కు నమోదుకు అవకాశం



కోవెలకుంట్ల: ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్



ప్యాపిలి: పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌ఓకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ

కోవెలకుంట్ల: మండలంలో ఓటు హక్కు లేని 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఆయా పోలింగ్ బూత్‌ల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటు హక్కు నమోదు కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి సూచించారు. శనివారం చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. కొత్తగా ఓటు హక్కు నమోదుతోపాటు ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు, తొలగింపులు, తదితర అంశాలకు సంబంధించి ఓటర్లు ఫారం -6,7,8, 8ఏలను అందజేయవచ్చని పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ ఆర్‌ఐ పుల్లయ్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వేగవంతం చేయాలి

ప్యాపిలి: 18 ఏళ్లు నిండిన వారి పేర్లను కొత్తగా ఓటరు జాబితాలో నమోదు చేయాలని ఆర్డీఓ నరసింహులు ఆదేశించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల (కేజీ)లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన తహసీల్దార్ భారతితో కలిసి పరిశీలించారు. ఎక్కువ శాతం మంది ఇంకా ఓటరుగా తమ పేర్లు నమోదు చేసుకోలేదన్నారు. ఈ విషయంలో బీఎల్‌ఓలు దృష్టి సారించి తమ పరిధిలో ఉన్నవారిని గుర్తించి వెంటనే ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయాలని ఆదేశించారు.

ఉల్లాసంగా మాదిగల కార్తీక వనభోజనాలు

ప్యాపిలి: స్థానిక ఆంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం మాదిగలు ఏర్పాటు చేసిన కార్తీక వనభోజన కార్యక్రమం ఉల్లాసంగా సాగింది. కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి ఆంజనేయస్వామి గుడి వద్దకు ర్యాలీ నిర్వహించారు. ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్తీక వనభోజనాలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు గంధం శ్రీను, చందోలి తిరుపాలు, ఆర్పీ మద్దిలేటి, బాలరంగన్న, వెంకటరాముడు, రంగన్న, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సద్వినియోగం చేసుకోండి

కోవెలకుంట్ల: 2024–25 సంవత్సరానికి సంబంధించి రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. ఈ పథకం కింద ఎకరా శనగ పంటకు రూ. 84, జొన్నకు రూ. 60, మినుము రూ. 48, వరి రూ. 126 చొప్పున ప్రీమియం చెల్లించాల్సి ఉందన్నారు. పొలం పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలు, రైతు సేవా కేంద్రం నుంచి పంటలు సాగు చేసినట్లు ధ్రువపత్రం, ఆధార్‌కు లింకు అయిన సెల్ నంబర్, తదితర వివరాలు అందజేయాలన్నారు. వచ్చే నెల 15వ తేదీలోపు గ్రామ సచివాలయం, మీసేవ, కామన్‌సర్వీస్‌సెంటర్లు, పోస్టాఫీసుల్లో ప్రీమియం చెల్లించాలని సూచించారు. ప్రీమియం చెల్లిస్తే అకాల వర్షాలతో పంటనష్టం జరిగితే నష్టపరిహారం అందుతుందని వివరించారు.

చెడు అలవాట్లతో జీవితం నాశనం

డోన్ రూరల్: చదువుకునే వయసులో చెడు అలవాట్ల జోలికి వెళితే జీవితం నాశనం అవుతుందని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. మండల పరిధిలోని యు.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. క్రమశిక్షణతో చదివితే విజయం సాధించవచ్చని తెలిపారు. విద్యతోపాటు క్రీడలు చాలా అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులకు బాల్ బ్యాడ్మింటన్ సామగ్రిని అందించారు. హెచ్‌ఎం చంద్రశేఖర్,వ్యాయామ ఉపాధ్యాయుడు సుధాకర్ పాల్గొన్నారు.



విద్యార్థులతో డీఎస్పీ శ్రీనివాసులు

ఐచర్,ఆటో ఢీ.. డ్రైవర్‌కు గాయాలు

బేతంచెర్ల: టమాట లోడ్‌తో వెళ్తున్న ఐచర్ వాహనాన్ని ఆటో ఢీకొన్న ఘటన శనివారం బేతంచెర్ల మండల పరిధిలోని బుగ్గానిపల్లె తండా రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ గాయపడ్డాడు. వివరాలు.. బేతంచెర్ల నుంచి నంద్యాల వైపు టమాట లోడ్‌తో ఐచర్ వాహనం వెళుతోంది. మరోవైపు బేతంచెర్లకు చెందిన ఆటో డ్రైవర్ వెంకటేష్ పని నిమిత్తం నంద్యాలకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. బుగ్గానిపల్లె తండా వద్ద ఐచర్ వాహనాన్ని ఆటో ఢీకొంది. ఆటో డ్రైవర్ వెంకటేష్‌కు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 సిబ్బంది బేతంచెర్లకు తరలించారు. ఆటోను తప్పించే క్రమంలో ఐచర్ వాహనం పంట పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది.



గాయపడిన ఆటో డ్రైవర్

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

బేతంచెర్ల: మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని డోన్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.తంగమణి, ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్ బేగం అన్నారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో విధాన్ సే సమాధాన్ కార్యాక్రమంలో భాగంగా మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మహిళలు న్యాయ సహాయం పొందడంపై అవగాహన కల్పించారు. సమాజంలో చెడు సంఘటనలు జరగకుండా ఉండాలంటే మన ఇంటి నుంచే మార్పు ప్రారంభం కావాలన్నారు. స్త్రీ, పురుష భేదం లేకుండా చూడాలన్నారు. పిల్లలకు మంచి, చెడుపై అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం అన్నారు. సీనియర్ న్యాయవాదులు గోపాల్ రెడ్డి, మీనిగ కుమారి మాట్లాడుతూ..రాజ్యాంగంలోని చట్టాలు, మహిళల హక్కులు, మహిళలు, బాలికలపై అసభ్యకరంగా ప్రవర్తించే వారికి పడే శిక్షలతో పాటు బాధితులకు ప్రభుత్వం తరఫున అందే ఉచిత న్యాయ సహాయాన్ని వివరించారు. ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, ఎంఈఓ సోమశేఖర్ మాట్లాడుతూ.. పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. బాలికల విద్యకు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనులకు పంపిస్తే తల్లిదండ్రులు శిక్షార్హులు అవుతారన్నారు. నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, ఎస్‌ఐ రమేష్ బాబు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు తిప్పమ్మ, రాధమ్మ, ఈశ్వరమ్మ, శోభారాణి, న్యాయవాదులు నారాయణ, సుమంత్ పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న డోన్ సివిల్ కోర్టు జడ్జి తంగమణి , హాజరైన మహిళలు

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన ప్రమీలమ్మ తన భర్త ప్రహ్లాద, ఆడపడుచు రాములమ్మ, అత్త హుసేనమ్మ శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ షేక్షావలి శనివారం తెలిపారు.

మహిళపై దాడి.. ఏడుగురిపై కేసు

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన గుడిసె రాములమ్మపై తమ్ముడు ప్రహ్లాద భార్య ప్రమీలమ్మ మరో ఆరుగురు దాడి చేసి గాయపరిచినట్లు బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు 7 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు.

బీమాతో రైతుకు ధీమా

డోన్ రూరల్: రబీలో సాగు చేసిన పప్పుశనగ, జొన్న, మినుము, వేరుశనగ, వరి పంటలకు బీమా చేయించుకోవాలని డోన్ సహాయ వ్యవసాయ సంచాలకులు పి.అశోక్‌వర్ధన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేస్తున్నాయని తెలిపారు. రైతులు మూడు ఎకరాల వరకు బీమా చేయించుకోవచ్చని చెప్పారు. వ్యవసాయ అధికారులు అబ్దుల్‌షఫీ, రవి, షేక్షావలి పాల్గొన్నారు.

చామంతి సాగులో సస్యరక్షణ అవసరం

బేతంచెర్ల: చామంతి పూల సాగులో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని బనగానపల్లె కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఆదినారాయణ అన్నారు. శనివారం మండల పరిధిలోని సీతారామాపురం గ్రామంలో మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు.

కనుల పండువగా జ్వాలాతోరణం



ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు





ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవ స్వామి, చెన్నకేశవ స్వామి ఆలయంలో జ్వాలా తోరణం వెలిగిస్తున్న దృశ్యం

అవుకు: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో కార్తీక శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. స్వామి అమ్మవార్లను ఉదయాన్నే ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామివారి పాదాలు, మహాశివుడు, త్రిశూల ప్రతిమలను అలంకరించారు. సాయంత్రం జ్వాలా తోరణం కనుల పండువగా జరిగింది. స్వామి అమ్మవార్లను పల్లకీలో ఆలయ ముఖద్వారం వద్ద ఆశీనులు చేసి జ్వాలా తోరణాన్ని వెలిగించారు. భక్తులు పెద్ద ఎత్తున దీపాలు వెలిగించడంతో ఆలయ ప్రాంగణం కొత్త శోభను సంతరించుకుంది. అనంతరం స్వామి అమ్మవార్లకు పల్లకీ సేవ, మంగళహారతి, చక్ర హారతి నిర్వహించారు.

25న దిపోత్సవం

బనగానపల్లె: స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో ఈ నెల 25న దిపోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు యాతం వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, పుష్పాభిషేకం తదితర పూజలు జరుగుతాయని చెప్పారు. సాయంత్రం అయ్యప్పస్వామి దిపోత్సవం ఆలయం నుంచి ప్రారంభమై ఆస్థానం రోడ్డు, పాతబస్టాండ్, కూరగాయాల మార్కెట్, ఆంజనేయస్వామి ఆలయం మీదుగా సాగుతుందన్నారు. అనంతరం ఆలయంలో అయ్యప్ప స్వామికి పడిపూజ ఉంటుందన్నారు. పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు బలిజల కార్తీక వనభోజనం

బనగానపల్లె: పట్టణంలోని నంద్యాల రహదారిలో ఉన్న కాశయ్య తోటలో ఆదివారం శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందరమ్మతో పాటు పలువురు ముఖ్య నాయకులు హాజరవుతున్నట్లు చెప్పారు. బలిజ సంఘీయులు అధిక సంఖ్యలో పాల్గొని వనభోజన కార్యక్రమం విజయవంతం చేయాలని మండల బలిజ సేవా సంఘం సభ్యులు కోరారు.